అనిశ్చితి..!

- హమాలీ కార్డులు ఉన్నా పూడూరు గోదాముల్లో పని కరువు
- గద్వాల జిల్లా కేంద్రంలో 600 మంది కార్మికుల ఎదురుచూపు
- కేసులు, వివాదాల కారణంగా ఆరేళ్లుగా పని కల్పించలేని పరిస్థితి
- అన్ని అనుమతులతో తెరిచినా రాజకీయ జోక్యంతో ఆందోళన
- గతంలోనూ ధాన్యం నిల్వలు, తాజాగా సీసీఐ కాటన్ బేల్స్ స్టోర్
- 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం, పరోక్షంగా వేల మందికి ఉపాధి

ఉపాధి కల్పించేందుకు సిద్ధమే



నేను అన్ని ఆస్తులు అమ్ముకొని గోదాములను కొనుగోలు చేశాను. కానీ, ఆ రోజు నుంచి రాజకీయ ఒత్తిళ్లతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గోదాం వల్ల ప్రత్యక్షంగా 600 మంది కార్మికులు, పరోక్షంగా దాదాపు 2 వేల మంది ఉపాధి పొందుతారు. కోర్టులో పిల్ ఉండటంతో దాదాపు ఆరేళ్లు మూసివేశారు. ఉపాధి పోయింది. ఇప్పుడు అన్నీ పరిష్కరించుకుని, కోర్టు ఆదేశాల మేరకు అన్ని అనుమతులు పొందిన తర్వాత కూడా ఈ ఒత్తిళ్లు తప్పడం లేదు. కార్మికులకు ఉపాధి కల్పించడానికి నేను సిద్ధంగా ఉన్నారు.

- పత్తి రవికుమార్, గోదాముల యజమాని

మహబూబ్‌నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గద్వాల జిల్లా కేంద్రం సమీపంలోని పూడూరులో నిర్మించిన ప్రైవేటు గోదాముల విషయంలో కార్మికులకు పని కల్పించే విషయమై అనిశ్చితి నెలకొన్నది. సుమారు 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కౌకుంట్ల గోదాముల తర్వాత పెద్ద గోదాములు ఇక్కడే ఉన్నాయి. గోదాముల నిర్మాణ సమయంలో అందులో హమాలీలుగా పనిచేసేందుకు కార్డులు ఇప్పించారు. అధికారికంగా 450 మందికి హమాలీ కార్డులు ఇవ్వగా అంత పెద్ద సామర్థ్యం కలిగిన గోదాముల్లో పనిచేయడానికి మరో 150 మంది హమాలీలు అవసరం పడతారు.

అయితే గోదాముల నిర్మాణ సమయంలో కేసులు, వివాదాలు చాలా నెలకొన్నాయి. అనుమతుల విషయంలో కొంత ఇబ్బందులు ఏర్పడగా అప్పట్లో కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైంది. తర్వాత అన్ని అనుమతులు పొందిన తర్వాతనే గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే, తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, డీటీసీపీ, నాలా, గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకున్న తర్వాత ఇటీవల గోదాముల్లో స్టాక్ నిల్వ చేయడం ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ కార్మికులకు పని కల్పించడంలో అనిశ్చితి నెలకొన్నది. తాజాగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి కాటన్ బేల్స్‌ను నిల్వ చేస్తున్నారు. అప్పట్లో కార్డులు పొందిన వారికి పని కల్పించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్మికులు కూడా తమకు పని కల్పించాలని కోరుతున్నారు. ప్రస్తుతం వేరే రాష్ట్రాలకు చెందిన కార్మికుల ద్వారా బేల్స్ లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండటంతో కార్మికుల్లో ఆందోళన నెలకొన్నది. 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల్లో నిత్యం 600 మంది హమాలీలకు పని ఉంటుంది. అలాగే 200 పైచిలుకు లారీలు వస్తూ పోతుంటాయి. వీటి ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఈ నేపథ్యంలో స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలనే డిమాండ్ వస్తోంది.

- ఆది నుంచి వివాదాలే...

ఈ గోదాముల నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి వివాదాలు ఉండటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో కార్మికులుగా నమోదు చేసుకునే క్రమంలో చాలామంది డబ్బులు చెల్లించారు. ఒక్కో కార్మికుడికి ఇక్కడ పనిచేస్తే దాదాపు రూ. 3 వేల నుంచి రూ. 4 వేల వరకు కూలీ లభించే అవకాశం ఉంది. అయినా తాము రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నామని గోదాముల యాజమాన్యం తెలుపుతోంది. కోర్టులో పిల్ దాఖలు చేసిన తర్వాత దాదాపు ఆరేళ్లపాటు ఇక్కడ కార్మికులకు పని లభించలేదు. తర్వాత కోర్టు ఆ పిల్‌కు సంబంధించి ఆర్డర్ ఇచ్చి సంబంధిత శాఖల నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్లు తీసుకున్న తర్వాత నిల్వకు అనుమతులు ఇవ్వాలని డీటీసీపీకి డైరెక్షన్స్ ఇచ్చింది. ఆ తర్వాత నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తీసుకున్నారు.

ఇప్పటికీ ఏదో రకంగా రాజకీయ ఇబ్బందులు కలిగించే ప్రయత్నం జరుగుతోందని, అందువల్లే తాము స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించలేకపోతున్నామని యాజమాన్యం చెబుతోంది. ప్రస్తుతం సీసీఐ బేల్స్‌ను రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తెచ్చి ఇక్కడ స్టోర్ చేస్తుండటంతో మరోసారి రాజకీయ జోక్యంతో ఇబ్బందులు

మిగతా 6వ పేజీలో...



గద్వాల జిల్లా కేంద్రం సమీపంలో గల పూడూరు గోదాం

అనుమతితోనే తెరవాలి



పూడూరు గోదాములు కోర్టు డైరెక్షన్ ప్రకారం అనుమతులు తీసుకున్నారా, లేదా అనేది అధికారులకు తెలుపకుండానే తెరిచారు. అందువల్ల అనుమతుల పరిశీలన కోసం, అధికారులు సీజ్ చేసిన దాన్ని అధికారులతోనే తెరిపించాలనే విషయంపై నోటీసులు జారీ చేశాం. దాని ప్రకారం పూర్తి వివరాలు తీసుకుంటున్నాం.

- లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్, జోగుళాంబ గద్వాల

ప్రతీ ఎకరాకు సాగునీరు

- అందించడమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు దగ్గర రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ముందుగా ప్రాజెక్టు జలాశయాలకు పూలతో ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేసి మాట్లాడారు. రైతులు తమ పంటలను ఇప్పుడే సాగు చేసుకుంటున్నారు.. కావున పంటలకు కుడి, ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. సంక్రాంతి పండుగకు రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ వేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న కాల్వ పనులను వెంటనే పూర్తి చేసి మిగతా గ్రామాలకు కూడా సాగునీరు అందిస్తామన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంజీల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారుక్ అలీ, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, చందు, మండల నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, రాంపాండు, ఆది హన్మంతురెడ్డి, కొండ అంజన్‌కుమార్‌రెడ్డి, కొనరా శేఖర్, గోపాల్, వెంకటేష్, గోవర్దన్, చందుగౌడ్, భరత్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

కొనసాగిన వాలీబాల్ టోర్నీ

- నువ్వానేనా అన్నట్లుగా ఉత్కంఠగా సాగుతున్న పోటీలు

- నేడు ఫైనల్‌మ్యాచ్

కోస్గి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా ప్రేక్షకుల హర్షధ్వనాల మధ్య జాతీయస్థాయి క్రీడలు కొనసాగాయి. ఉత్కంఠ భరితంగా సాగుతున్న ఈ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తిలకించేందుకు అధిక సంఖ్యలో యువకులు, విద్యార్థులు ఎగబడుతున్నారు. బుధవారం హోరా హోరీగా సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో ఉత్తరప్రదేశ్- సీబీఎస్సీ, గుజరాత్--రాజస్థాన్ జట్లు తలపడ్డాయి. దేశవ్యాప్తంగా క్రీడాకారులు తమ ప్రతిభ ను చూపుతూ అండర్-19 వాలీబాల్ కప్ దక్కించుకునేందుకు అహర్నిషలు కష్టపడి ప్రత్యర్థి జట్టుతో తలపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఈ క్రీడలు నిర్వహించేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్ణయించడంతో నెలరోజులుగా ఏర్పాట్లు పూర్తిచేసి నాలుగు రోజులనుంచి క్రీడాపోటీలు జరిగాయి. గురువారం ఫైనల్‌మ్యాచ్ జరగనుంది.

- ఫైనల్‌కు చేరుకున్న జట్లు

గత నాలుగురోజులుగా సుమారు తొమ్మిది జట్లతో తలబడుతూ నువ్వానేనా అన్నట్లుగా సాగిన ఆటల్లో చివరగా ఫైనల్‌కు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ జట్లు చేరుకున్నాయి. విన్నర్స్ రన్నర్స్ ఎవరన్న భవితవ్యం నేడు తేలనుంది.



ఉత్కంఠభరితంగా సాగుతున్న ఉత్తరప్రదేశ్, గుజరాత్ మధ్య మ్యాచ్



సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో కబడ్డీలో తలబడుతున్న జట్లు(ఫైల్)

పాలమూరులో ఆటల పండుగ

- రేపటి నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- 33 జిల్లాల నుంచి తరలిరానున్న 850 మంది క్రీడాకారులు

7

వాటర్ ట్యాంకర్ ఢీకొని బాలుడి మృతి

మిడ్జిల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన ఓ వాటర్‌ప్లాంటు యాజమానికి చెందిన వాహనం నీటిని అమ్మేందుకు బోయిన్‌పల్లి గ్రామానికి చేరుకుంది. సలాఉద్దీన్ చిన్న కుమారుడు రెహన్(5) ఇంటి ముందు ఆడుకుంటుండగా గమనించని ట్యాంకర్ డ్రైవర్ అజాగ్రత్తగా వెనక్కి వెళ్లడంతో రెహన్ టైరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం రెహన్‌ను జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యేసు బోధనలు భావితరాలకు అందించాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన పాస్టర్లు
- పలు చర్చిల ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే
- కల్వరి ఎంబీ చర్చిలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ



కేక్ కట్ చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యేసు ప్రభువు బోధనలను భావితరాలకు అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని క్రిస్టియన్‌పల్లిలోని బెత్లెహేమ్ చర్చి, మోతీనగర్‌లోని బెత్తేస్థ హోలీ చర్చిలలో నిర్వహించిన ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఎంబీసీ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలలో ఎంపీ డీకే అరుణతో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు నిస్వార్థ జీవనానికి నిదర్శనమన్నారు. గతంలో ఎన్నో విద్యా సంస్థలు ఎంబీ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించి ఎందరికో విద్యను అందించారన్నారు. ఈ పవిత్ర క్రిస్మస్ వేడుకల సందర్భంగా మరిన్ని విద్యాసంస్థలు ఏర్పాటు చేసి నిరుపేదలకు విద్యను అందించాలని ఆయన కోరారు. అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. నిజాం సంస్థానంలో నాడు ఏర్పడిన సెయింట్ జార్జెస్ పాఠశాలలోనే తాను విద్యాభ్యాసం చేశానన్నారు. అక్కడి పాస్టర్లు అందించిన ప్రోత్సాహం, సహకారం ఎంతో గొప్పదన్నారు. ఎంపీ అరుణ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ యేసు మార్గం అనుసరణీయమన్నారు.

కార్యక్రమంలో రెవరెండ్ వరప్రసాద్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ఏపీ మిథున్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనితారెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది విజయ్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, బెత్తేస్థ హోలీ చర్చి పాస్టర్ పృథ్వీరాజ్, బెత్లెహమ్ ఎంబీ చర్చి ప్రతినిధులు ఆర్.వరప్రసాద్, ప్రేమ్‌కుమార్, అబ్రహం, శరత్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ/మక్తల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని లంకాల, నర్వ గ్రామాల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా లంకాల గ్రామం క్రైస్తవుల పిలుపు మేరకు ఆయన ఈ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మత పెద్దలు క్రైస్తవులు, యేసుక్రీస్తు చరిత్రను వివరించారు. అనంతరం నర్వ చర్చిలో పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, కృష్ణారెడ్డి, బీసం రవి, శ్రీనివాస్ రెడ్డి, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు. మక్తల్ పట్టణంలోని చర్చి వద్ద బుధవారం క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. పాస్టర్లు విజయ్, లక్ష్మారెడ్డి, అడ్వకేట్ దత్తాత్రేయ, ఆనంద్‌గౌడ్, రవి కుమార్ పాల్గొన్నారు.



లంకాలలో క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

ఆర్చరీ టోర్నీలో రవికి స్వర్ణం

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



అర్చరీ పోటీల్లో స్వర్ణం సాధించిన రామవత్ రవి, పక్కన కోచ్ జ్ఞానేశ్వర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కొల్లూర్‌లో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ టోర్నీలో జిల్లాకు చెందిన క్రీడాకారుడు రామవత్ రవి సబ్‌జూనియర్ ఇండియన్ రౌండ్ విభాగంలో స్వర్ణం సాధించాడు. 345 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. టోర్నీలో ప్రతిభ చాటి రాజస్థాన్‌లో 2025 జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్‌జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలోని న్యూరిషి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటం పట్ల జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, సెక్రటరీ రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.



అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న భక్తులు



అయ్యప్ప ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

అయ్యప్ప శరణుఘోష



- పాలమూరులో భారీ శోభాయాత్ర

- ఘనంగా మహా పడిపూజ
- భక్తిపాటలు, భజనలతో పరవశించిన అయ్యప్పస్వాములు
- ట్రాఫిక్‌ను దారి మళ్లించిన పోలీసులు

6



మహబూబ్‌నగర్‌లో అయ్యప్ప స్వాముల శోభాయాత్ర, (ఇన్‌సెట్‌లో)కలశాలకు పూజలు చేస్తున్న వేదపండితులు

అనిశ్చితి..!

(మొదటిపేజీ తరువాయి)

కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. తాజాగా కలెక్టర్ కూడా కోర్టు డైరెక్షన్స్ ప్రకారం అన్ని అనుమతులు ఉన్నాయా, లేదా అని పరిశీలించాలని సూచిస్తూ రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీకి నోటీసులు జారీ చేశారు. ఆ మేరకు గోదాముల యాజమాన్యం అన్ని అనుమతులు ఉన్నాయని వివరణ లేఖతో పాటు అనుమతుల ప్రతులను అప్పగించింది.

- ప్రతీ పనిలో రాజకీయ జోక్యం...

వాస్తవానికి ఈ గోదాములు ప్రైవేటువే అయినప్పటికీ వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికులు, డ్రైవర్లు, క్లీనర్లకు ఉపాధి లభిస్తుంది. కానీ, అన్ని అనుమతులు ఉన్నా రాజకీయ ఇబ్బందులు నెలకొన్నాయి. పార్టీలు, ప్రభుత్వాలు మారినా అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గోదాముల యాజమాన్యం చెబుతోంది. కొందరు రాజకీయ నాయకులు డబ్బులు డిమాండ్ చేయడమో, తాము చెప్పినట్లు వినాలని ఆదేశించడమో ఇప్పటికీ జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్డులు తీసుకొని ఏళ్లు గడుస్తున్నా తమకు ఉపాధి లభించడం లేదని కార్మికులు ఓవైపు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ఆస్తులు అమ్మి కొనుగోలు చేసిన మిల్లులో రాజకీయ ఒత్తిళ్లు తగ్గితే వేలాది మందికి ఉపాధి కల్పించే బాధ్యత తాము తీసుకుంటామని యాజమాన్యం చెబుతోంది. ఇప్పటికే ఆరేళ్లు గోదాముల నిర్వహణ లేకపోవడం వల్ల అప్పులకు వాయిదాలు చెల్లించడానికి ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోందని అంటోంది.

ఇప్పటికే చాలా నష్టపోయాం



ఈ గోదాములో లోడింగ్, అన్‌లోడింగ్‌కు చాలామంది అవసరం.. దాదాపు 450 నుంచి 600 మంది హమాలీలు ఉపాధి పొందుతారు. రోజుకు 150 నుంచి 200 లారీలు వస్తుంటాయి. పోతుంటాయి. లారీ యాజమనులకు, డ్రైవర్లకు, క్లీనర్లకు పని ఉంటుంది. ఈ గోదాములను నమ్ముకొని చిరు వ్యాపారులు కూడా ఉపాధి పొందే అవకాశం ఉంది. గోదాములను కొనసాగించాలి.

- మోహిన్, లారీ అసోసియేషన్ సెక్రటరీ

గోదాంతో చేతినిండా పని



ఈ గోదాము సమీప గ్రామాల్లోని వారికి ఇక్కడ హమాలీ కార్డులు తీసుకున్నాం. గోదాములు అనేక వివాదాల కారణంగా మూతపడ్డాయి. ఇప్పుడు తెరుచుకున్నప్పటికీ వేరే రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. హమాలీ కార్డు తీసుకున్న మేము ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. మళ్లీ మూసివేస్తారనే ప్రచారంతో మాకు ఆందోళన ఉంది. గోదాములో మేము ఉపాధి పొందడానికి సహకరించాలి.

- అభిలాష్, హమాలీ కార్మికుడు

అయ్యప్ప శరణుఘోష

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో గల అయ్యప్పకొండపై బుధవారం 27వ వార్షిక అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ, గణపతిహోమం, అయ్యప్పస్వాములు రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం వన్‌టౌన్ సమీపంలోని తూర్పుకమాన్ వద్ద నుంచి పూజలు నిర్వహించిన అయ్యప్పస్వాములు 18 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. యాత్ర రామ్‌మందిర్ చౌరస్తా, గడియారం చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా, ఫారెస్ట్ కార్యాలయం, పాత కలెక్టరేట్, న్యూటౌన్ చౌరస్తా, మెట్టుగడ్డల మీదుగా అయ్యప్పకొండకు చేరుకుంది. పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప కరుణతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొని అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. ఊరేగింపులో అయ్యప్పస్వాములు భక్తిపాటలు, భజనలు, కీర్తనలు పాడి పరవశం చెందారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. శోభాయాత్రలో వేలాదిగా అయ్యప్పస్వాములు పాల్గొన్నారు. శోభాయాత్ర నిర్వహిస్తున్న దారిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనయ్య వాహనాలకు దారిమళ్లించారు. అయ్యప్పకొండకు చేరాక అయ్యప్ప స్వాములు స్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ, ఏపీ మిథున్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, అయ్యప్పసేవా సమాజం సభ్యులు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కొండపై మహా పడిపూజలో పాల్గొన్న భక్తులు



పాల్గొన్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్



మహబూబ్‌నగర్ ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మహబూబ్‌నగర్ ఎంబీ చర్చిలో పాటలు పాడుతూ.. పియానో వాయిస్తున్న కళాకారులు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

● ఉమ్మడి జిల్లాలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ.. పాటలు పాడుతూ సంగీత విభావరి నిర్వహించారు. కొందరు సెల్ఫీలు దిగుతూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



గద్వాల జిల్లా కేంద్రంలో గల ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, క్రైస్తవులు



మహబూబ్‌నగర్ ఎంబీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



వనపర్తి ఒలివ చర్చిలో సెల్ఫీ దిగుతున్న యువతులు



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గోకారం చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు



జడ్చర్ల ఎంబీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



మహబూబ్‌నగర్ ఎంబీ చర్చిలో సేవకులకు సూచనలిస్తున్న పాస్టర్ వరప్రసాద్

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్ సూచించారు. గాంధీ ఆశయ సాధన కోసం సత్యశోధన పేరుతో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్రను చేపట్టిన ఆయన బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణానికి చేరుకున్నది. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండేందుకు పాదయాత్రలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, సీనియర్ విశ్రాంత ఉద్యోగులు వార్డెన్ చెన్నయ్య పాండు, మదన్మోహన్, సరసయ్య, వీరేశలింగం, కళాధర్‌శర్మ, బాస వెంకటేశ్వర్లు, హసన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

- వైభవంగా అమ్మవారి విగ్రహ గ్రామోత్సవం



గ్రామ వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఉండవల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కర్రెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు కొనసాగు తున్నాయి. మూడో రోజు బుధవారం ఉదయం నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. నేడు ఉదయం 11:30 గంటలకు ఆలయంలో కర్రెమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించ నున్నట్లు ప్రధాన అర్చకుడు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కమ్ముకుంటున్న మేఘాలు

ఇటిక్యాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో వానాకాలం సాగులో భాగంగా రైతులు 2,153 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. ఈ నెల మొదటి వారం నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో పొగాకు పంటను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పొగాకు కోసి తోరణాలు కుచ్చి ఆరబెట్టి సమయంలో వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి తడిస్తే పొగాకులో ఉన్న జిగురు పోతుందని బెంగపడుతున్నారు. వర్షపు సూచనతో కొతకు వచ్చిన ఆకును కోసేందుకు రైతులు సాహసం చేయలేకపోతున్నారు. ఇప్పటికే పొగాకు కోసిన రైతులు తోరణాలకు టార్పాలిన్ కవర్లు కప్పి కాపాడుకుంటున్నారు.

మండలంలో గతేడాదితో పోలిస్తే పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో ధరలు కూడా పడిపోతాయని ఆందోళన చెందుతున్నారు. గతేడాది క్వింటాలుకు రూ.18 వేలు చెల్లించారు. ఈ ఏడాది ధరలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో వర్షాలు కురిస్తే పొగాకు రైతులకు పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటిక్యాల మండలంలో చాగాపురం, షాబాద, ఉదండాపురం, పెద్దదిన్నె, ఇటిక్యాల, వేముల, బట్లదిన్నె, వల్లూరు మొగిలిరావులచెర్వు గ్రామాలతో పాటు అలంపూరు నియోజక వర్గంలో అన్ని మండలాల్లో పదివేల ఎకరాల వరకు పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల ద్వారా తెలిసింది. వర్షాలు కురిస్తే ఒక్క పొగాకు పంటనే కాకుండా వరి, మిరప రైతులు కూడా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని వారు వాపోతున్నారు.



ఇటిక్యాలలో పొగాకు తోరణాలపై కప్పిన టార్పాలిన్ కవర్లు

రైతులకు సూచనలు చేస్తున్నాం



రెండు వారాలనుంచి వాతావరణంలో మార్పు రావడంతో పొగాకుతో పాటు వరి, పత్తి, మిరప పంటలను కాపాడుకునేందుకు తగిన సలహాలు ఇస్తున్నాం. ఆరుగాలం శ్రమించిన రైతులు ధాన్యం కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆయా గ్రామాల పరిధిలోని ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

- రవికుమార్, మండల వ్యవసాయ అధికారి

కౌలుకు తీసుకొని పంట సాగు చేశా



గతేడాది పొగాకుకు డిమాండ్ ఉండటంతో ఈ ఏడాది మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేశాను. పంట కోతకు వచ్చింది. వర్షాలు వస్తాయని అంటున్నారు. ఈ సమయంలో వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతాం. తొందరపడి పొగాకు కోసినా ఆకును కాపడుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

- రాంబాబు, రైతు ఇటిక్యాల

ముసురు వస్తుందని భయమేస్తోంది



పొగాకు కోత దశకు వచ్చిన సమయంలో ముసురు వస్తుందంటే భయమేస్తోంది. వర్షం పడితే పొగాకు నల్లగా మారితే ధర లభించదు. రైతులు పండించిన ప్రతీ పంటను విక్రయించే దాకా చంటిపిల్లలకు కాపాడుకున్నట్లు కాపాడుకోవాలి. అయినా మార్కెట్లో ధర వస్తుందో లేదో తెలియదు.

- సురేంద్ర, రైతు ఉదండాపురం

వాజపేయి జీవితం అందరికీ ఆదర్శం

- కుప్పగండ్లలో అటల్‌జీ విగ్రహావిష్కరణ

- హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్‌జీ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

వెల్దండ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయభావాలు కలిగిన మాజీ ప్రధాని అటల్‌బిహార్ వాజపేయి జీవితం అందరికీ ఆదర్శమని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వాజపేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కుప్పగండ్ల హాజరై స్థానిక నాయకులతో కలిసి వాజపేయి విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ భారతదేశ ఔనత్యాన్ని, గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు తెలిపిన ఘనత వాజపేయిదే అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. నేటి రాజకీయ నాయకులు, యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. గ్రామీణ వ్యవస్థ పటిష్ఠతకు, మౌళిక సదుపాయాల కల్పనకు ప్రధానిగా ఆయన అవలంభించిన తీరు ప్రశంసనీయమని అన్నారు. కుప్పగండ్ల గ్రామంలో ఆయన విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందని రాష్ట్ర నాయకులు ప్రశంసించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, జాతీయ బీసీకమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, నాయకులు శేఖర్‌రెడ్డి, యాదగిరి, పరమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శారదమ్మ తదితరులు ఉన్నారు.



వాజపేయి విగ్రహావిష్కరణలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి: సీపీఎం



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఎండీ జబ్బార్

వనపర్తి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని అమలు చేయాలని సీపీఎం నాయకుడు జబ్బార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాన్‌గల్ మండలంలోని రేమద్దులలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన దీక్షకు మద్ధతుగా మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమయ్యాయని వారు విమర్శించారు. కేరళ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీపీఎం పార్టీ ప్రజా సమస్యలు పరిష్కారంలో ముందుందని గుర్తు చేశారు. సామాజిక వర్గాలకు ఇళ్ల నిర్మాణానికి రూ. పది లక్షల ప్రభుత్వం ప్రకటించిందని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చేసి సంవత్సరం గడిచిన ఏ ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల



చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు (గద్వాల) డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని మాచర్ల లక్ష్మీ చెన్నకేశవస్వామి జాతరను పురస్కరించుకొని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుడు హన్మంతునాయుడు ప్రత్యేక పూజలు చేశారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

బిజినేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ప్రయాణంలో సెల్‌ఫోన్ పోగుట్టుకున్న బాధితురాలికి డ్రైవర్ సత్యం బుధవారం ఫోన్ అందజేశారు. నాగర్‌కర్నూల్ మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన రోజా మంగళవారం కొల్లాపూర్ నుంచి నాగర్‌కర్నూల్ బస్సులో వెళ్లింది. నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో బస్సు దిగేటప్పుడు సెల్‌ఫోన్ మరిచిపోయింది. ప్రయాణికులంతా వెళ్లిన తర్వాత సీటుపై కనిపించిన సెల్‌ఫోన్‌ను బస్సు డ్రైవర్ ఊర్కొండ సత్యం తీసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు పోగుట్టుకున్న ఫోన్‌కు కాల్ చేశారు. దీంతో డ్రైవర్ వారిని పిలిపించి కండక్టర్లు విజయ్ కుమార్, హేమాద్రిలతో కలిసి సెల్‌ఫోన్ అంద జేసి తన నిజాయితీ చాటుకున్నారు. గతంలో చాలామంది సెల్‌ఫోన్లు, ల్యాప్ ట్యాప్‌లు మర్చిపోతే బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు నిజాయితీ అందించడంతో ప్రయాణికులు వారిని అభినందించారు.

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు
పరిశీలకుడిగా 'పేట' డీవైఎస్‌వో



వెంకటేశ్ శెట్టి

మక్తల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువజన క్రీడా శాఖ నారాయణపేట జిల్లా అధికారి వెంకటేశ్ శెట్టి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పరిశీలకుడిగా నియమితులయ్యారు. కోస్గి పట్టణంలో కొనసాగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ అండర్ - 19 వాలీబాల్ పోటీలకు ఆయన పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. ఈ క్రీడా పోటీలకు 21 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు, ఏడు కేంద్రీయ విద్యాలయాలకు సంబంధించిన 32 జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పీఈటీలు విష్ణువర్ధన్, రాజేశ్వరీ, ఈశ్వర్, నరేశ్ అభినందించారు.

పాటల పోటీల్లో మద్దూరు వాసి ప్రతిభ



గోవా మంత్రి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న షఫీ

మద్దూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గాయకుడు మహ్మద్ రఫీ శతజయంతిని పురస్కరించుకొని గోవాలో నిర్వహించిన పాటల పోటీల్లో నారాయణపేట జిల్లా మద్దూరుకు చెందిన షఫీ ప్రతిభ చూపారు. స్వర్‌సంగం కళామందిర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'కౌన్ బనేగా దిల్‌సే రఫీ' పాటల పోటీల్లో ఆయన పాల్గొని ప్రథమ బహుమతిని సాధించారు. ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి సుధీర్ దవలికర్ లిఖో బా చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ఈ పోటీలో మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన గాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నం

» దొంగపై తిరగబడిన మహిళ



పెంటమ్మ

పెబ్బేరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు యత్నించిన దొంగపై ఆమె తిరగబడింది. గొలుసును గట్టిగా పట్టుకొని కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. వనపర్తి జిల్లా పెబ్బేరులో ఈ సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన పెంటమ్మ అనే మహిళ పోస్ట్ ఆఫీస్ పక్కన బండి పెట్టుకొని పళ్లు విక్రయిస్తూ జీవనం గడుపుతోంది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం ఆమె పళ్ల బండిని సిద్ధం చేసుకుంటుండగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి, మంకీ క్యాప్ ధరించి బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి బంగారు పుస్తెల గొలుసును లాక్కెళ్లేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె గొలుసును గట్టిగా పట్టుకొని కేకలు వేసింది. ఆ సమయంలో ఇద్దరి మధ్య పెనుగు లాట జరిగింది. దీంతో రెండు వరుసలున్న గొలుసులో ఒక వరుస తెగి పోయింది. అయినా గొలుసు చేతికి రాకపోవడంతో దొంగ పరారయ్యాడు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదృశ్యమైన బాలుడి మృతదేహం లభ్యం

చిన్నచింతకుంట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అదృశ్యం అయ్యాడు. అతడి మృతదేహం గ్రామ సమీపంలోని నీటి గుంతలో లభ్యం అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చెందిన అఖిల్ (6) ఈ నెల 23న ఇంటి ఎదుట ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో బాలుడి మృతదేహం గ్రామ సమిపంలోని నీటి గుంతలో తేలింది. స్థానికులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా బాలుడి మృతిపై తండ్రి దశరథ అనుమానం వ్యక్తం చేశారు. అతడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గొర్రెల దొంగలు అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్, చిత్రంలో ఎస్‌ఐలు

మక్తల్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళ మందల నుంచి గొర్రెలను అపహరిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాకు చెందిన రమ్య అలియాస్ హనుమంత, బలిచక్రం తండాకు చెందిన బస్సప్ప, భీరప్ప అలియాస్ బీరప్పలు ఈ నెల 21న దండు శివారులో అర్ధరాత్రి సమయంలో పెద్ద సాబెణ్ణకు చెందిన 15 గొర్రెలను ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు రాత్రి మక్తల్ పట్టణ సమీపంలోని తిరుమలాపూర్ వద్ద శివలింగప్పకు చెందిన గొర్రెలను చోరీ చేసి, టాటా ఏస్ వాహనంలో తరలించారు. కాపరులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించి, విఫలం అయ్యారు. అదే రోజు రాత్రి మక్తల్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా, గొర్రెలను తరలిస్తున్న వాహనాన్ని చూసి అనుమానంతో ఆపి, స్టేషన్‌కు తరలించారు. నిందితులను విచారించగా, దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 15 గొర్రెలను స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

భూత్పూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీప్‌మాన్‌సింగ్ అలియాస్ దీపక్ (45) అనే వ్యక్తి భూత్పూర్‌లో నివాసం ఉంటూ, జాతీయ రహదారి పక్కన ఉండే ఓ దాబాలో మూడేళ్లుగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి దాబా మూసివేసిన తర్వాత ఇంటికి వెళ్తూ, టాటా షోరూమ్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలస్యంగా గమనించిన స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మూసాపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింతకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి అడ్డాకుల మండలంలోని కన్మనూరులో తిరుగుతూ ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తు న్నాడు. గమనించిన గ్రామస్థులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై విచారణ నిర్వహించి, తగిన చర్యలు చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

పాలమూరులో..
ఆటల పండుగ

» రేపటి నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు » 33 జిల్లాల నుంచి తరలిరానున్న 850 మంది క్రీడాకారులు

» మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో చురుగ్గా ఏర్పాట్లు » 31 నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్



కబడ్డీ కోర్టును పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్, క్రీడా సంఘాల ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆటల పండుగకు పాలమూరు సిద్ధం అవుతోంది. సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ, నెట్‌బాల్ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం వేదిక కానున్నది. ఏడాది పాలన ముగిసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు 'సీఎం కప్' పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ నెల ఐదు నుంచి 24వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి పోటీలు ముగిశాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు, 31 నుంచి జనవరి రెండవ తేదీ వరకు నెట్‌బాల్ పోటీలను నిర్వహించేందుకు జిల్లా క్రీడాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం

మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 850 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వారితో పాటు 100 మందికి పైగా కోచ్‌లు, మేనేజర్లు హాజరుకానున్నారు. 27వ తేదీన ఉదయం 11 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. క్రీడాశాఖ జిల్లా అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడా శాఖ జిల్లా అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు వారికి సహకరిస్తున్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించనున్నారు. ప్రధాన స్టేడియం మైదానంలో ఆరు కోర్టులు ఏర్పాటు చేశారు. ఒక వేళ వర్షం పడితే మ్యాచ్‌లను ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. పోటీలకు తరలిరానున్న క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. బాలికలకు ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల, టీపీహెచ్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం, బాలురకు పాతిమా, రెయిన్‌బో స్కూల్, మాడ్రన్ హైస్కూల్, అంబేద్కర్ భవన్, ఎంవీఎస్ కళాశాలల్లో బస, స్టేడియం మైదానంలో భోజనం, ఇతర వసతులు ఏర్పాటు చేశారు.

టోర్నమెంట్లకు ఏర్పాట్లు పూర్తి చేశాం



అందరి సహకారంతో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లను విజయవంతంగా నిర్వహిస్తాం. గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు ముగిశాయి. మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ, నెట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్.

పూర్తి సహకారం అందిస్తాం



జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పూర్తి సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

- కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి.

మూలమల్ల క్రీడాకారులు జిల్లాకే గర్వకారణం

» గ్రామంలోని క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన డీఎస్‌డీవో



మూలమల్ల క్రీడాకారులతో డీఎస్‌డీవో సుధీర్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ సభ్యుడు కురుమూర్తి

ఆత్మకూరు, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి) : మూలమల్ల కబడ్డీ క్రీడాకారులు జిల్లా గర్వకారణమని క్రీడా శాఖ జిల్లా అధికారి (డీఎస్‌డీవో) సుధీర్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల్ల కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న వైనంపై ఈనెల 21న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ఆదర్శ సురభి స్పందించారు. మూలమల్ల గ్రామ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మూలమల్ల గ్రామంలోని మినీ క్రీడా ప్రాంగణాన్ని బుధవారం డీఎస్‌డీవో పరిశీలించారు. అంతకుముందు జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను కలిసి అభినందించారు. గ్రామ సమీపంలో క్రీడా ప్రాంగణానికి స్థలం కేటాయించిన పద్మజా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కావాల్సిన వసతుల కల్పనకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైదానంలో తాగునీటి వసతి, మ్యాట్, డ్రస్సింగ్ రూమ్, మినీ జిమ్, లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని క్రీడాకారులు ఆయనను కోరారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యుడు కురుమూర్తి, సీనియర్ క్రీడాకారులు ఎల్లప్ప, గోపాల్, అశోక్, కేశవ్, శివకృష్ణ, చిన్న రాజు, వెంకట్ రాములు, వినయ్, దినకర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విచారణ ఎప్పటికి పూర్తయ్యేను?

» ఏప్రిల్ ఒకటిన పెబ్బేరు మార్కెట్ యార్డ్ గోదాంలో అగ్ని ప్రమాదం

» బూడిదైన 23 వేల బస్తాల ధాన్యం, 15 లక్షల గన్నీ బ్యాగులు » దాదాపు రూ. 40 కోట్ల మేర నష్టం



అగ్ని ప్రమాదం జరిగిన పెబ్బేరు మార్కెట్ యార్డు గోదాం

పెబ్బేరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మార్కెట్ యార్డు గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిన తొమ్మిది నెలలు గడిచినా విచారణ కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటిన జరిగిన ఈ ప్రమాదంలో 23 వేల ధాన్యం బస్తాలు, 15 లక్షల గన్నీ సంచులు కాలి బూడిదయ్యాయి. మొత్తంగా రూ.40 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సంఘటనపై వెంటనే విచారణ చేపట్టి, నిందితులను గుర్తించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు విచారణలో ఎలాంటి పురోగతీ లేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తం అవుతున్న పలు అనుమానాలు

అగ్నిప్రమాద ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ సరఫరా కూడా లేని గోదాంలో అగ్నిప్రమాదం ఎలా జరిగిందన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ధాన్యం నిల్వ ఉంచిన గోదాం వద్ద పర్యవేక్షణ లేకపోవడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి ధాన్యం లెక్కలు చెప్పాల్సి వస్తుందనే ఉద్దేశంతో కావాలనే నిప్పు పెట్టారా? ధాన్యం పాడైపోతే ఇన్సూరెన్స్ డబ్బు కోసం ఈ సంఘనకు పాల్పడ్డారా అనే కోణంలో అధికారులు చేపట్టిన విచారణ ఏమయ్యిందన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఐదు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన ఈ గోదాంలో మూడు కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. మొదటి దానిలో రైస్ మిల్లులకు చెందిన 14,500 ధాన్యం బస్తాలు, రెండవ దానిలో 15 లక్షల గన్నీ బ్యాగులు, మూడో దానిలో మరో రైస్‌మిల్లు వ్యాపారికి చెందిన 70 వేల ధాన్యం బస్తాలను నిల్వ చేశారు. అయితే అవి కొందరు నాయకులకు సంబంధించినవి కావడం వల్లే సంఘటనకు కారణాలను గోప్యంగా ఉంచారనే అనుమానాలున్నాయి. అగ్ని ప్రమాదం జరుగక ముందే ఏడు లక్షల రూ పాయల విలువైన గన్నీ బ్యాగులను పక్క దారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

విచారణ చివరి దశకు వచ్చింది

అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టిన అధికారులు పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేశారు. పోలీసులు దర్యాప్తు నివేదికను ఇస్తే సంఘటనకు కారణాలు, బాధ్యులు ఎవరు తదితర వివరాలు తెలుస్తాయి. ఆ తర్వాతే వివరాలను వెల్లడిస్తాం. ఇన్సూరెన్స్ అధికారులకు కూడా నివేదికను అందిస్తాం.

- రమేష్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, వనపర్తి జిల్లా.

దంపతులపై ఆకతాయిల దౌర్జన్యం

» వారి కుమారుడు, ఓ కానిస్టేబుల్‌పై కూడా మూకుమ్మడి దాడి



అల్లరి మూకలను అడ్డుకుంటున్న పోలీసులు

గద్వాల క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తున్న దంపతులపై మద్యం మత్తులో ఉన్న ఆకతాయిలు దాడి చేశారు. అడ్డొచ్చిన కుమారుడు, కానిస్టేబుల్‌పై కూడా మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పెద్ద అగ్రహారం ప్రాంతానికి చెందిన దంపతులు శివన్న, సిద్ధమ్మ ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆవు అడ్డం రావడంతో సెడన్ బ్రేక్ వేశారు. దీంతో వారి వెనుకనే బైక్ మీద వస్తున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి కిందపడ్డారు. మీరు సెడన్ బ్రేక్ వేయడం వల్లే తాము కింద పడ్డాంటూ వారు శివన్నపై దాడి చేశారు. కొద్ది దూరంలో మరో బైక్‌పై వస్తున్న వారి కుమారుడు హర్ష సంఘటనను గమనించి అక్కడికి చేరుకొని వారిని అడ్డుకోవడంతో అతడిపైనా దాడి చేశారు. అనంతరం వారు తమ అనుచరులకు ఫోన్ చేయడంతో దాదాపు 20 మంది అక్కడికి చేరుకొని హర్షపై మూకుమ్మడిగా దాడి చేశారు. వారి నుంచి తప్పించుకున్న హర్ష నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్‌ఐకి సమాచారం అందించాడు. వెంటనే ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ సంఘటనా స్థలానికి సిబ్బందిని పంపించాడు. వారిలో ఓ కానిస్టేబుల్‌పై కూడా అల్లరి మూక దాడికి పాల్పడింది. దీంతో ఎస్‌ఐ వెంటనే అక్కడికి చేరుకుని కొందరిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

తాడూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని లచ్చిరాంతండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. మండలంలోని సిర్సవాడ గ్రామానికి చెందిన నారాయణ, జంగమ్మ దంపతులు కుమారుడితో కలిసి బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ద్విచవాహనంపై వెళ్తూ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో జంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైద్యం కోసం వచ్చిన గర్భిణి మృతి

» ప్రైవేట్ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు » వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



ప్రైవేట్ ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణి మృతి చెందింది. వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే అందుకు కారణమని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం ఆలేరు గ్రామానికి చెందిన చెందిన రాములమ్మ(25) మూడు నెలల గర్భిణి. వైద్యం కోసం బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చింది. అక్కడి వైద్యుడు లక్ష్మారెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులను ఆమెను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో గర్భిణి బంధువులు, కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. రాములమ్మకు సకాలంలో వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే ఆమె మృతి చెందిందని ఆరోపించారు. ఆసుపత్రి గుర్తింపును రద్దు చేసి, డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సమాచారం అందడంతో ఎస్‌ఐ గోవర్ధన్, సీఐ కనకయ్యలు అక్కడికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడారు. సంఘటనపై ఫిర్యాదు చేయాలని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని చెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కాగా రాములమ్మకు షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వైద్యుడు లక్ష్మారెడ్డి వివరణ ఇచ్చారు.

ఇంటర్వ్యూ..

సకాలంలో వైద్యం చేయించాలి

» పశువైద్యాధికారి మధుసూదన్



మూసాపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు, కాపరులు పశువులకు కాలనుగుణంగా సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్యం చేయించాలని అడ్డాకల మండల పశువైద్యాధికారి మధుసూదన్ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

రైతులకు ఏ పథకాలు అందుబాటులో ఉన్నాయి?

రైతులకు లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా పశువులు, గొర్రెలు పెంచుకోవడానికి రూ.20 లక్షలు, రూ.40 లక్షలు, రూ.60 లక్షల చొప్పున బ్యాంకు రుణాలు ఇస్తున్నామని, వాటికి 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. పీఎస్‌ఈజీపీ స్కీమ్ ద్వారా డెయిరీ నిర్వహణకు రూ.20 లక్షల నుంచి బ్యాంకు రుణాలు ఇస్తున్నామని, 25 నుంచి 30 శాతం సబ్సిడీ ఉంది.

సిబ్బంది కొరత ఉందా?

మండలంలో కందూరు, అడ్డాకులలో పశువైద్యశాలలు ఉండగా రాచాల, పొన్నకల్‌లో ఉప కేంద్రాలు ఉన్నాయి. కందూరులో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో అడ్డాకులతో పాటు కందూరు ఇన్‌చార్జిగా ఉన్నాను.

ఉపాధి హామీ ద్వారా పశువుల పాకలు నిర్మిస్తున్నారా?

ఉపాధి హామీ ద్వారా పొలంలో పశువుల పాక నిర్మాణానికి రూ.85 వేలు, పాడి పశువుల గడ్డి పెంపకానికి రూ.ఆరు వేలు అందిస్తాం.

మందుల కొరత ఉందా?

ప్రస్తుతం మందుల కొరత లేదు. సీజనల్ ప్రకారం మందులు వస్తున్నాయి. పశువుల గణాంకాలు చేస్తున్నాం. ఆ లెక్కల ప్రకారం మందులు వస్తాయి.

న్యూస్ బాక్స్

మరియమ్మకు ప్రత్యేక పూజలు

గండీడ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నాయిపల్లి గ్రామ శివారులో ఉన్న మరియమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇన్‌కంటాక్స్ కమిషనర్ రాంచంద్రనాయక్, కొందుర్గు ఎంఈవో అంగుర్‌నాయక్, హరిచందర్‌నాయక్, ఆలయ దాత జానియ, మాజీ సర్పంచు గీతాపాండు, గోపాల్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

నవాబ్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇప్పటూర్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు పైపులైన్ పనులు ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొంత కాలంగా తాగునీరు సరఫరా కావడం లేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేశారని నాయకులు సూరి, మాధవులు తెలిపారు.

పాలమూరును మొదటి స్థానంలో నిలపాలి

పాలమూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు గజిటెడ్ ఆఫీసర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఎంపికైన గజిటెడ్ ఆఫీసర్స్ కమిటీ ప్రత్యేకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రామకృష్ణగౌడ్, విజయ్‌కుమార్, వరప్రసాద్, యాదగిరి, రవీందర్, బాలుయాదవ్, తానాజీ, సంధ్య, డాక్టర్ నరేష్, జాకీర్ అహ్మద్, జగన్‌మోహన్‌రెడ్డి, కరణం రాజు, ఇమ్రాన్, చంద్రకళ ఉన్నారు.

బాలల మనోవికాసానికి వేదిక బాలోత్సవం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పిల్లల సర్వతోముఖాభివృద్ధికి వారి మనోవికాసానికి వేదికగా బాలోత్సవం నిలుస్తోందని పిల్లల మర్రి బాలోత్సవం అధ్యక్షుడు బెక్కం జనార్దన్, ప్రధాన కార్యదర్శి డా.ప్రతిభ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుశృత ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చదువుతో పాటు పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలన్నారు. ఈనెల 27, 28వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించే పిల్లల పండుగలో 46 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన ఐదువేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. కోశాధికారి ప్రమోద్‌కుమార్, సభ్యుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'ప్రభుత్వ టీచర్లను కేజీబీవీలకు ఎలా పంపుతారు'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను కేజీబీవీలో బోధన చేయాలని ఎలా పంపుతారని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వామన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు 16 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేసే టీచర్లను కేజీబీవీల్లో తాత్కాలికంగా పంపి బోధన చేయించడం తగదన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

హన్వాడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టంకర గ్రామానికి చెందిన నాగలక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో బుధవారం సాయంత్రం 108కు కాల్ చేశారు. 108 ఈఎంటీ మహబూబ్ భాష, పైలెట్ శివశంకర్ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికవడంతో ప్రసవం చేశారు. అనంతరం హన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



క్రిస్టియన్‌పల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న పాస్టర్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చిన్నచింతకుంటలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్/జడ్చర్ల/మిడ్జిల్/దేవరకద్ర/నవాబ్‌పేట/చిన్నచింతకుంట/ భూత్పూర్/ మూసాపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలో కాంగ్రెస్ మీడియా సెల్ ఇన్‌చార్జి సీజే బెనహర్ నివాసంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ కేక్ కట్ చేశారు. నాయకులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రి, అనిత, షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

జడ్చర్ల పట్టణంలోని ఎంబీ చర్చిలో నిర్వహించిన వేడుకలకు హైదరాబాద్‌లోని ఏసీటీసీ రెవరెండ్ యోనాతాన్ ముఖ్య అతిథిగా పాల్గొని, క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. పట్టణంలోని పెంథకోస్ట్ చర్చితో పాటు పలు చర్చీల్లో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా వక్తలు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు.

మిడ్జిల్ మండలం రెడ్డిగూడ, వాడియాల, మున్ననూర్, కొత్తూరు, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తపల్లి, మిడ్జిల్ గ్రామాల్లోని చర్చీల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిలో మార్కెట్ చైర్మన్ జ్యోతి ప్రత్యేక ప్రార్థన అనంతరం కేక్ కట్ చేశారు. చర్చి పాస్టర్ అబిశోలుం, రాజారత్నం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బరిగెల వెంకటయ్య, సాయులు, మల్లికార్జున్‌రెడ్డి, ఉస్మాన్, వెంకట్‌రెడ్డి, సిరాజ్, వెంకట్‌సాగర్, దేవరాజు పాల్గొన్నారు.

దేవరకద్ర మండల కేంద్రంతో పాటు కౌకుంట్ల, పేరూర్ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నవాబ్‌పేట మండలంలోని చౌడూర్, మల్లారెడ్డిపల్లి, కారూర్, తీగలపల్లి, నవాబ్‌పేట, కూచూర్, దయపంతులపల్లి, పోమాల్ గ్రామాల్లోని చర్చీల వద్ద పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చిన్నచింతకుంట మండల కేంద్రంతో పాటు ఉంద్యాల, నెల్లికొండిలోని ఎంబీ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని, కేక్‌ను కట్ చేశారు. అప్పంపల్లి సింగిల్ విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గిజ్జన్, యోనా, శేఖర్, ప్రతాప్, సుదర్శన్, విజయ్, యాకోబు పాల్గొన్నారు.

భూత్పూర్ పట్టణ కేంద్రంలోని చర్చిలో సంఘం నాయకులు గడ్డం ప్రేమ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు మురళిధర్‌గౌడ్ పాల్గొని కేక్ కట్ చేసి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ గడ్డం రాములు, యాదయ్య, శ్రీనివాస్, రామస్వామి పాల్గొన్నారు.



క్రిస్మస్ ట్రీ



ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అడ్డాకుల మండల కేంద్రంలోని ఎంబీ సీయోన్ సంఘం చర్చిలో కిస్మస్ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, కేకు కట్ చేశారు. మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజాగోరి, క్రైస్తవ సంఘం నాయకులు రాములు, ఎంపీ ఆనందం, డెవిడ్, శ్యామ్ పాల్గొన్నారు.



భూత్పూర్ చర్చిలో మాట్లాడుతున్న గడ్డం ప్రేమ్‌కుమార్



మిడ్జిల్ చర్చిలో కేక్‌ను కట్ చేస్తున్న మార్కెట్ చైర్మన్ జ్యోతి

వాజపేయి జీవితం ఆదర్శం



మహబూబ్‌నగర్‌లో వాజపేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/పాలమూరు/జడ్చర్ల/మిడ్జిల్/భూత్పూర్/హన్వాడ/బాలానగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని, దివంగత అటల్ బీహారి వాజపేయి జీవితం నేటి తరానికి ఆదర్శమని ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వాజపేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, మాట్లాడారు. వాజపేయి ఆలోచనా విధానాలను బీజేపీ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. అనంతరం పీయూ ఎదుట ఉన్న సాందీపని ఆవాసంలో మొక్కలు నాటారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు జి.పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.రాము, కె.రాములు, పాందురంగారెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, మెట్టుకాడి శ్రీనివాసులు, యాదయ్య, కె.సతీష్‌కుమార్, జయశ్రీ, గోవిందనాయక్, జాజం సుబ్రహ్మణ్యం, నారాయణయాదవ్, ప్రవీణ్‌యాదవ్, నవీన్‌కుమార్‌రెడ్డి, దర్పల్లి హరికృష్ణ పాల్గొన్నారు.

జడ్చర్ల మునిసిపాలిటీ హౌజింగ్ బోర్డులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు బీజేపీ నాయకులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకుముందు వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు సామల నాగరాజు, రమేశ్‌జీ, సామల నర్సిములు, శ్రీనివాస్‌గౌడ్, బాలకృష్ణ, బాలవర్ధన్‌గౌడ్, మధు, రాజశేఖర్‌రెడ్డి, కొంగళి శ్రీకాంత్, వెంకట్, నవీన్, శ్రీనాథ్, నరేశ్, అంజలి పాల్గొన్నారు.

విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతిరూపం అటల్ బీహారి వాజపేయి అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎస్సీ బాలికల వసతి గృహంతో పాటు వృద్ధులకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, గిరిజనమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ నాయక్‌లతో కలిసి పండ్లు పంపిణీ చేశారు.

వాజపేయి ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. భూత్పూర్‌లో వాజపేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అమిస్తాపూర్‌కు చెందిన ఆటో రాంచంద్రయ్య కూతురు శైలజ నీప చదువకు బండారి శాంతికుమార్, సుదర్శన్‌రెడ్డి కలిసి రూ.50 వేలు అందజేశారు.

హన్వాడ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు వాజపేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

చిన్నచింతకుంట మండల కేంద్రంలో వాజపేయి చిత్ర పటానికి బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజు, అసెంబ్లీ కన్వీనర్ రమేష్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాము, మహేష్, చంద్రుడు, రుతుకుమార్, బాలచందర్ పాల్గొన్నారు.



భూత్పూర్‌లో వాజపేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి

మనుస్మృతి వల్లే దళితులకు అవమానాలు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్

పాలమూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో మనుస్మృతి వల్లే దళితులు అనేక అవమానాలు, చీత్కరింపులకు గురయ్యారని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'మనుస్మృతి - రాజ్యాంగం' అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్టిలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 1927 డిసెంబరు 25న మహదు పట్టణంలో మనుస్మృతి పదాలను డాటీఆర్ అంబేడ్కర్ దహనం చేశారని గుర్తు చేశారు. నేటికి 97 ఏళ్ల క్రితం అంబేడ్కర్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. దళితులు అవమానాలు, అణచివేత, మెజారిటీ ప్రజలు సర్వ హక్కులు కోల్పోయారని తెలిపారు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను నేటికీ పెంచిపోషిస్తున్నది మనువాదం శాస్త్రం అన్నారు. అందుకే అంబేడ్కర్ దహనం చేశారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఒక్కో అంశాలను తొలగిస్తూ ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. నేడు బీజేపీ నాయకులు దేశ భక్తులుగా చలామణి అవుతూ సమస్యలపై ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవటానికి ప్రతీ ఒక్కరు కంకణ బద్ధులై గ్రామగ్రామాన మనుస్మృతి, రాజ్యాంగానికి ఉన్న తేడాను వివరించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య, టీపీఎస్‌కే జిల్లా కార్యదర్శి వి.కురుమూర్తి పిలుపునిచ్చారు. ఆది విష్ణు, వి.పద్మ, శంకర్‌రాములు, ఎ.లక్ష్మయ్య, రాములు, పద్మ, హన్మంతు, నందు పాల్గొన్నారు.

మనుస్మృతిని తగులబెట్టి 97 ఏళ్లు

1927 డిసెంబరు 25న మహదు పట్టణంలో మనుస్మృతిని అంబేడ్కర్ దహనం చేసి నేటికి 97 ఏళ్లు అవుతోందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర మోహన కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు సిరివాటి శ్రీనివాసులు, ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, గడ్డమీది గోపాల్, గన్నారపు సరోజన, వన్నాడ ఆంజనేయులు, ఖలీల్, చక్రవర్తి ప్రసంగించారు.

క్రీడలతో దేశభక్తి పెంపొందుతుంది



విజేతలకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు, ఆటల పోటీలతో క్రీడాకారుల్లో దేశభక్తి, జాతీయతా భావాలు పెంపొందుతాయని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలో మద్దూరి సత్యనారాయణరెడ్డి స్మారకార్థం వారి కుమారుడు చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, ఓడిన వారు నిరాశకు లోను కాకుండా గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ పోటీలో మొత్తం 44 టీంలు పాల్గొనగా, అడ్డాకుల టీం మొదటి బహుమతి రూ.30 వేలు, రన్నర్‌గా నిలిచిన పెద్దమందడి టీంకు ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజేతలకు బహుమతులు అందజేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దూరి జితేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజాగోరి, మాజీ సర్పంచు జయన్నగౌడ్, మండల నాయకులు విజయకుమార్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రాజేందర్, రాజునాయక్, మహేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రమేష్, యాదయ్య, గంగిరెడ్డి, జహంగీర్ గోరి, కృష్ణయ్య, రాము పాల్గొన్నారు.

రజక సమితి రాష్ట్ర మహా సభల పోస్టర్ విడుదల

జడ్చర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మూడవ మహాసభల పోస్టర్‌ను బుధవారం జడ్చర్లలో ఆవిష్కరించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 29న జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఈ మహాసభలలో రజకులు ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో పాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. నాయకులు బాలవర్ధన్‌గౌడ్, బాలకృష్ణ, కౌన్సిలర్ లత, నిరంజన్, జంగయ్య, వెంకటేశ్, రంగయ్య, శేఖర్, యాదయ్య, చిన్నయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం తన నివాసంలో ఆవిష్కరించి, మాట్లాడారు. నిరుపేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, ఆరు పథకాలను పొందుపరుస్తూ క్యాలెండర్ రూపొందించడం పట్ల సొసైటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాలలకు ప్రభుత్వ భవనాలు నిర్మించాలని సొసైటీ తరుపున విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్ బాబా, యాకుబ్, సోహెల్‌ఖాన్, మహమూద్ పాల్గొన్నారు.

హిందువులను జాగృతం చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హిందువులను జాగృతం చేసేందుకు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు తమకు నిర్దేశించిన కాలనీల్లో సత్సంగ కార్యక్రమాలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ సత్సంగ సంయోజక్ పండరీనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఒక ఆలయాన్ని కేంద్రంగా చేసుకుని వారంలో ఒక రోజు సత్సంగం నిర్వహించాలని సూచించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్దియాదిరెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మండల స్థాయి కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. నలిగేశి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాదిగ మహా గర్జన విజయవంతం చేద్దాం

హన్వాడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జనవరి 19న జరిగే మాదిగ మహా గర్జనను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బుద్దారంలో మహా గర్జన కరపత్రం విడుదల చేసి, మాట్లాడారు. జిల్లా కేంద్రంలో త్వరలో నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా యాదయ్యను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు యాదయ్య, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

దేవరకద్ర, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నామస్మరణతో దేవరకద్ర మార్మోగింది. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని హాస్టల్ వద్ద కర్ణంరాజు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి హాజరుకాగా, ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అలంకరణ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు బాల్‌రాజు, కిట్టు, అరుణ్, పుల్లి, సురేష్, నరేష్, సుదీర్‌స్వామి, ఎస్సీ నాయకులు వెంకట్రములు, ఆంజనేయులు, రాములు, కండక్టర్ నర్సిములు, రాజు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మూసాపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తున్నామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పుర కురుమూర్తి పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా మండలంలోని పోల్కంపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. అనుచిత అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాకు కేంద్ర మంత్రి వర్గంలో కొనసాగే అర్హత లేదని, వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు నర్సింహులు, వెంకటయ్య, మహేందర్, బాలయ్య, మల్లేష్, శేఖర్ పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

పాలమూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని జనరల్ మేనేజర్ విశాల్ కృష్ణ సిన్హ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి రైతుల ప్రయోజనాల దృష్ట్యా సీసీఐ శాఖ కార్యాలయం మహబూబ్‌నగర్ పరిధిలోని తొమ్మిది, జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని తెలిపారు. సీసీఐకి కనీస మద్దతు ధరకు విక్రయించాలనుకునే రైతుల నమోదు ప్రక్రియ ఆధార్ నంబర్ ఆధారంగా కొనసాగుతోందన్నారు. పత్తిలో 8శాతం తేమ మించకపోతే, రైతులకు పూర్తి కనీస మద్దతు ధర (యం.ఎస్.పీ) చెల్లిస్తోందన్నారు. అదే విధంగా తేమ శాతం 8శాతం కంటే ఎక్కువ, 12 శాతం మించకపోతే సీసీఐ కనీస మద్దతు (యం.ఎస్.పీ) ధరను తదను సారంగా తగ్గింపులతో కనీస మద్దతు ధర చెల్లిస్తోందన్నారు. కాబట్టి రైతులు పత్తిని ఆరబెట్టి సీసీఐకి తీసుకొచ్చి విక్రయించి, మద్దతు ధరను పొందాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 12 శాతం తేమ కంటే ఎక్కువ తేమ ఉండకూడదన్నారు. మరిన్ని వివరాలకు సీవోటీటీ-ఏఎల్‌ఎల్‌వై మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అదే విధంగా సీసీఐ బ్రాంచ్ కార్యాలయం మహబూబ్‌నగర్, 08542-222210ను సంప్రదించాలని కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరసన సమ్మె బుధవారంతో 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహిళ ఉద్యోగులు ధర్నా చౌక్‌లో ముగ్గులు వేస్తూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సమస్యను పరిష్కరించాలని రేవంత్‌రెడ్డి చిత్రంతో పాటు సమస్యలను ముగ్గులలో వేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తాము నిరసన చేస్తుంటే సమస్యలపై దృష్టి పెట్టకుండా కేజీబీవీలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో బోధన చేయించేందుకు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికైన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదగిరి, ఖాజామైనోద్దీన్, ఇక్రం, తిరుపతయ్య గౌడ్, ఉదయ్, శంకరమ్మ, సుజాత, నాగలక్ష్మి, గంగమ్మ పాల్గొన్నారు.